సాగునీటికీ రైతుకు కన్నీరేనా?

- అధ్వానంగా పలు ప్రధాన కాలువలు
- నిర్వహణ లోపమే ఆయకట్టుకు శాపం
- ఖరీఫ్‌లోనూ పట్టించుకోని యంత్రాంగం
- సకాలంలో పనులు చేయాలని డిమాండ్లు


చేబ్రోలు పిచ్చెమ్మ గుడి సమీపంలో పిచ్చిమొక్కలతో నిండి ఉన్న ముట్లూరు ఛానల్ దుస్థితి


చేబ్రోలు వద్ద బలహీనంగా ఉన్న అప్పాపురం ఛానల్

చేబ్రోలు : డెల్టా పరిధిలోని మేజర్ సాగునీటి కాలువలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టలేదు. ఈ కారణంగా వాటి పరిధిలోని ఆయకట్టులో వరి సాగుకు గడ్డు పరిస్థితులు ఎదురయ్యేలా ఉన్నాయి. జూన్ వచ్చి పది రోజులు అయినప్పటికీ వ్యవసాయానికి ప్రధానమైన కాలువల అభివృద్ధి పనులు, మరమ్మతులు, పూడికతీత వంటివి చేపట్టకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ప్రారంభమైతే ఈ పనులు చేపట్టడం కష్టమవుతుంది. అదే జరిగితే రైతులు తీవ్రంగా నష్టపోవలసి వస్తుంది. సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ కాలువలు అధ్వానంగా మారడంతో అన్నదాతలు సేద్యం చేయటానికి వెనుకంజ వేయాల్సిన పరిస్థితి నెలకొంది. కొద్దిపాటి భారీ వర్షాలు కురిస్తే పొలాల్లోని నీరు బయటకు పోయే పరిస్థితి లేకపోవటంతో పంట ముంపు బారిన పడి నష్టపోతున్నారు.

చేబ్రోలు మండలంలో సుమారు 20 వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. వారికి ప్రధాన సాగునీటి వనరులుగా కొమ్మమూరు ఛానల్, అప్పాపురం ఛానల్, పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్, కోవెలమూడి మేజర్ ఛానల్, సుద్దపల్లి నాలుగో నెంబరు మేజర్, పొన్నూరు ఛానల్, ముట్లూరు ఛానల్, మొండి కాలువలు మేజర్ ఛానల్స్ ఉన్నాయి. వీటి ద్వారా చేబ్రోలు మండలంతోపాటు పొన్నూరు, వట్టిచెరుకూరు, పత్తిపాడు, కాకుమాను, పెదనందిపాడు తదితర మండలాల పరిధిలోని గ్రామాల్లో 50 వేల ఎకరాల మాగాణి భూములకు సాగు నీరు అందిస్తున్నారు.

అధ్వానంగా అప్పాపురం ఛానల్

చేబ్రోలు మండలం వడ్లమూడి కొమ్మమూరు ఛానల్ వద్ద నుంచి వెళ్లే అప్పాపురం ఛానల్ 43 కి.మీ. పొడవున ఉంది. 25వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తోంది. దీని పరిధిలోనికి చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను, పత్తిపాడు మండలాలకు చెందిన భూములు వస్తాయి. చాలా కాలం క్రితం నిర్మించిన కాలువ కట్టలు బలహీన పడ్డాయి. దీంతో సాగునీరు పూర్తిగా విడుదల చేస్తే అవి నిలిచేలా లేవు. రైతుల అవసరానికి నీరు అందదు. వాన వస్తే పొలాలకు ముంపు తప్పని పరిస్థితి ఉంది. పూర్తి స్థాయిలో నీరు వదలకపోతే దిగువ రైతులకు సాగునీరు చేరదు. కొత్తరెడ్డిపాలెం, పాతరెడ్డిపాలెం నుంచి లేమల్లెపాడు వెళ్లే డొంక వద్ద ముట్లూరు వంగిపురం కూడళ్ల ప్రాంతంలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఏటా అనేక చోట్ల గండ్లు పడి రైతులు పంట నష్టపోతున్నారు. ఈ కాలువ తగిన ప్రమాణాలతో లోతులేదు. హెచ్చు తగ్గులుగా లోతు ఉండటం వల్ల సాగు నీరు నిర్దిష్ట సమయానికి దిగువ భూములకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి అనుసంధానమైన మైనర్ కాలువల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. మైనర్ కాలువలకు సాగునీరు అందించే తూములు మట్టితో నిండిపోవటం వల్ల నీరు కాలువలలోకి ప్రవహించే పరిస్థితి లేదు. సూపర్ ప్యాకేజీలు, సైఫన్ గొట్టాలు, అండర్ టన్నెలు సక్రమంగా లేవు.

ఆలస్యంగా సాగునీరు

పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్ కింద ఏటా సాగు నీరు ఆలస్యంగా విడుదల కావటం వల్ల సేద్యం పనుల్లో జాప్యం చోటుచేసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్ నుంచి సుద్దపల్లి వరకు సుమారు 11 చిన్న కాలువలు ఏర్పాటు చేశారు. నీరు సరిగా మైనర్ కాలువలోకి రాకపోవటంతో అక్కడ ప్రత్యేకంగా తూములు నిర్మించారు. అవి సక్రమంగా పని చేయటం లేదని రైతులు చెబుతున్నారు. కాలువలకు మరమ్మతులు చేయకపోతే ముున్ముందు చేదు అనుభవాలు తప్పవని రైతులు వాపోతున్నారు. కాలువ పొడవునా గుర్రపు డెక్క, తూడి కాడ తుమ్మలతో నిండి ఉంది. ఈ ఛానల్ దిగువన సాగవుతున్న వెయ్యి ఎకరాలలోని సుద్దపల్లి, వేజండ్ల వ్యవసాయ భూములలో సమస్యలు ఉత్పన్నం అయ్యాయి. రైతులు వర్షం కోసం ఎదురు చూడాల్సిందే తప్ప కాలువలకు సకాలంలో నీరు వస్తుందనే ఆశ మాత్రం లేదు.

కోవెలమూడి.. ఇబ్బందులు కోకొల్లలు

కోవెలమూడి ఛానల్ కింద సాగు చేసే రైతులకు సమస్యలు చాలానే ఉన్నాయి. ఈ ఛానల్ ద్వారా బుడంపాడు, చేబ్రోలు మండలంలోని నారాకోడూరు, గుండవరం, గొడవర్రు, లేమల్లెపాడు, కోవెలమూడి, ముట్లూరు గ్రామాల్లోని సుమారు 8 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. గుండవరం, గొడవర్రు గ్రామాల్లో కాలువ దీనావస్థకు చేరింది. గొడవర్రు సమీపంలో అండర్ టన్నెల్ దెబ్బతింది. తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టలేదు. ఛానల్ కట్టలు బలహీనంగా ఉన్నాయి. పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేస్తే గండ్లు పడే పరిస్థితి ఉంది. గుంటూరు ఛానల్ ద్వారా శలపాడు, శేకూరు గ్రామాల్లోని పంట పొలాలకు ఈ కాలువ నుంచి నీరు రావాల్సి ఉంది.

పొన్నూరు ఛానల్‌దీ ఇదే దుస్థితి

చేబ్రోలు గ్రామ శివారులోని కొమ్మమూరు ఛానల్ నుంచి మంచాల వైపు వెళ్లే పొన్నూరు ఛానల్ ద్వారా సుమారు 9 వేల ఎకరాలకు నీరు అందుతుంది. ఇది కూడా సరిగా లేదు. పూడికతీత చేపట్టాల్సిన పరిస్థితి ఉంది. ముట్లూరు ఛానల్ కింద కోవెలమూడి, ముట్లూరు, కారంపూడిపాడు, పాతరెడ్డిపాలెం, కొత్తరెడ్డిపాలెం, చేబ్రోలు గ్రామాలకు చెందిన సుమారు ఐదువేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాలువ చివరి భూముల వరకు సాగునీరు అందకపోవటంతో మంచి పంటలు పండే భూములు సైతం నిరుపయోగంగా మారుతున్నాయి. ఖరీఫ్ సీజను వస్తున్నా కాలువల పరిస్థితి మెరుగు పడకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది అనేక వ్యయ ప్రయాసల కోర్చి సాగు పనులు చేపట్టిన రైతులు పంట చేతికి అందే దశలో తుపాను ప్రభావం కారణంగా తీవ్రంగా నష్టపోయారు. రెండో పంటగా జొన్న, అపరాలు సాగు చేసిన వారికి కూడా ఆశించిన మేరకు దిగుబడులు రాకపోవటంతో దెబ్బతిన్నారు. గత అనుభవాలు పునరావృతం కాకుండా ప్రధాన కాలువలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పొన్నూరు మండలంలో...

పొన్నూరు: పొన్నూరు మండల పరిధిలో సుమారు 30 వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరిసాగు అవుతుంటుంది. అన్నదాతలు నారుమడులు వేసేందుకు సిద్ధమవుతున్నారు. సాగుకు కాలువల ద్వారా అందే నీరే ప్రధాన ఆధారం. కానీ కీలకమైన కాలువల నిర్వహణ పనుల విషయంలో అధికారుల నిర్లక్ష్యం రైతులను విస్మయానికి గురిచేస్తోంది. కొండమూడి, ఆలూరు, నిడుబ్రోలు, వడ్డిముక్కల, జడవల్లి తదితర గ్రామాల పొలాలకు వెళ్లే కీలకమైన అలవల కాలువ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వాటితోపాటు శ్రీ రంగపురం ఛానల్, వెల్లలూరు కాలువల్లో వ్యర్థాలు గుట్టలుగా పేరుకున్నాయి. తూడు, గుర్రపు డెక్క పేరుకుని ఉండటంతో నీటి ప్రవాహానికి ఆటంకం తప్పేలా లేదు. ఈ నెల చివరి వారంలో కాలువలకు నీరు విడుదలయ్యే అవకాశం ఉంది.


నిడుబ్రోలు కాలువలో గుర్రపు డెక్క

గుర్రపు డెక్కను తొలగించాలి



వేల ఎకరాలకు సాగునీరందించే పంట కాలువల్లో గుర్రపు డెక్క భారీగా చేరింది. చెత్త, వ్యర్థాలను తొలగించడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. ఈ నెలాఖరుకు కాలువలకు నీటి విడుదల జరిగే అవకాశాలు ఉన్నాయి. గుర్రపు డెక్క కారణంగా నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కాలువల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాను.

– బొద్దులూరి రంగారావు, వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు

కాటేసే కాలం

ఈ ఏడాది ఏప్రిల్ 6న సత్తెనపల్లి మండలం కందులవారిపాలెంలో జమ్ము కోస్తున్న బగ్గి వెంకటేశ్వర్లు (65) పాము కాటుకు గురై మృతి చెందాడు. గత నెల 21న సత్తెనపల్లి పట్టణంలోని 31వ వార్డులో కౌలు రైతు వాసుపల్లి లింగారెడ్డి (62) గేదెలకు వామి నుంచి గడ్డి తీస్తుండగా పాము కాటుకు గురై మృతి చెందాడు. ఇలా వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రస్తుతం రైతులు ఎక్కువగా పొలాల్లో గడుపుతారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ నెల నుంచి సెప్టెంబర్ వరకు పాములు, ఇతర విష కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.


- ఖరీఫ్‌లో విష సర్పాలతో జాగ్రత్త
- వానా కాలంలో పాముల సంచారం ఎక్కువ
- పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదాలు
- అన్నదాతలందరూ అప్రమత్తంగా ఉండాలి


పాముకాటుకు మృతి చెందిన కౌలు రైతు వాసుపల్లి లింగారెడ్డి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ బాబురావు

సత్తెనపల్లి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వానా కాలం ప్రారంభంలో విష సర్పాల బెడద ఎక్కువగా ఉంటుంది. పొలాల గట్ల మీద వెళ్లేటప్పుడు కర్ర చప్పుడు చేస్తూ నడవడం మంచిది. రాత్రిపూట పొలాలకు నీళ్ల పెట్టడానికి వెళ్లేటప్పుడు టార్చి లైట్ తీసుకువెళ్లాలి. ధాన్యపు గాదెలు, గడ్డివాములు ఉండే చోట ఎలుకలు తిరుగుతాయి. తడిగా ఉంటే కప్పలు చేరుతాయి. వాటిని తినడానికి పాములు చేరతాయి. అలాగే తేళ్లు వంటి ప్రమాదకర ప్రాణులు తిరుగాడే ఆస్కారముంది. ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉండాలి. ఎక్కువగా పాములు పొదల్లోనే ఉంటాయి. గోడల పక్కన చేరుతాయి. చీకట్లో బయటకు వెళ్తే తప్పనిసరిగా చెప్పులు వేసుకోవాలి.

అన్ని పాములు ప్రమాదకరం కాదు

పాముల్లో చాలా వాటికి విషం ఉండదు. కట్ల పాములే ప్రమాదకరమైన సర్ప జాతులు. వాటితోనే ఎక్కువ ప్రమాదం ఉంటుంది. సాధారణంగా 50 శాతం పాము కాట్లు విషం ప్రమాదం లేని మాములు గాయాలే. సాధారణ చికిత్స తీసుకుంటే నయమవుతాయి. పాముల కన్నా చాలా మంది షాక్ తోనే ప్రాణం మీదకి తెచ్చుకుంటారు. ఇంట్లో వారు ధైర్యం చెప్పడానికి బదులు ఏడిస్తే..బాధితుడు భయాందోళనకు గురై పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది.



ఇలా చేయకూడదు..

పాముకాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింతగా కోస్తే రక్తంతో పాటు విషం వచ్చేస్తుందని కత్తితో, బ్లేడుతో గాటు పెడతారు. అలా చేయవద్దు. ఒక్కో సారి పాము కాటు కన్నా ఈ గాయం ప్రమాదకరంగా మారవచ్చు.

ఆ జాగ్రత్తలు పాటించాలి..

- పాము కాటుకు గురైన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఆందోళన చెందితే గుండెపోటుకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.
- ప్రథమ చికిత్సలో భాగంగా పాము కాటు వేసిన చోట కట్టువేయాలి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి.
- పాము కాటు వేసిన ప్రదేశంలో కోరల గాయం స్పష్టంగా కనిపించి, నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్టు, గొంతు కండరాలు బిగుసుకున్నట్టు.. గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తవచ్చు.
- కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలో వ్యాక్సిన్

పాము కాటు బారిన పడిన వ్యక్తులకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స అందుబాటులో ఉంది. వారికి కావలసిన యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్లు అందు బాటులో ఉన్నాయి. పాముకాటు గురైన వ్యక్తి ఆందోళన, భయం చెందకుండా నిర్భయంగా ఉండాలి. పాము కరిచిన వెంటనే ముందుగా గాయం పై భాగాన్ని వస్త్రంతో గట్టిగా లాగి కట్టి ఉంచాలి. వెంటనే దగ్గరలోని వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేయించాలి. గాయాన్నిబట్టి రెండుసార్లు స్నేక్ వీనం డోస్ తీసుకుంటే ఎటువంటి ప్రమాదం ఉండదు. ముఖ్యంగా భయపడకుండా ఉండాలి.

–డాక్టర్ రవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, పల్నాడు

పాములు.. విష ప్రభావం

కట్లపాము: ఇది కాటేసిన వెంటనే విషం రక్తంలో కలుస్తుంది. ప్రాణపాయం ఎక్కువ. పాము కాటు వేసిన వెంటనే ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయించాలి. కట్ల పాము విషం రక్తంలోకి చేరకముందే వైద్యం చేయిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంది.

నాగుపాము: ఇది అత్యంత ప్రమాదకరం. ఈ పాము కాటు వేస్తే 15 నిమిషాల్లో విషం ఎక్కువగా ఎక్కుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రధానంగా నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు తెలుపుతున్నారు.

రక్తపింజర: ఇది ఎక్కువగా అటవీ ప్రాంతాల్లో తిరుగుతుంటుంది. ఈ పాము కాటు వేస్తే రెండు గంటల తర్వాత విషం శరీరానికి ఎక్కుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్త పింజర కాటు వేసిన వెంటనే విషాన్ని తొలగించేందుకు అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆసుపత్రులకు తీసుకువెళ్లి వైద్యం అందించాలని, వైద్యుల పర్యవేక్షణలో పాముకాటుకు గురైన వ్యక్తిని ఉంచాలని వైద్యులు సూచిస్తున్నారు.

జెర్రిపోతు, నీరుకట్టు: ఇవి కాటేసినా విషం ఉండదు. అయితే ఇవి కాటు వేసినా ఆసుపత్రిలో చికిత్స అవసరం.

ఈ తగు జాగ్రత్తలు పాటిద్దాం


డాక్టర్ పీఎం రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని కిడ్స్ పూల్‌లో కోచ్ పర్యవేక్షణలో స్విమ్మింగ్ (ఫైల్)

- బావులు, చెరువులు, కాలవల్లో ఈత ప్రమాదం
- స్విమ్మింగ్ పూల్‌లోనూ జాగ్రత్తలు పాటించాలంటున్న శిక్షకులు
- నిర్లక్ష్యం వహిస్తే వ్యాధులు తప్పవని హెచ్చరిక

సత్తెనపల్లి: వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి చక్కని మార్గం స్విమ్మింగ్ (ఈత). సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో పట్టణంలో ఒక స్విమ్మింగ్ పూల్ మాత్రమే ఉంది. ఇటీవల దీనిని ప్రారంభించారు. యువత, చిన్నారులు అక్కడ సందడి చేస్తున్నారు. ఎండ తీవ్రత పెరగడం, ఆరోగ్య పరిరక్షణ నేపథ్యంలో ఇటీవల కాలంలో స్విమ్మింగ్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఎండల ప్రతాపం నుంచి ఉపశమనం పొందేందుకు పల్లెల్లో చెరువులు, కుంటలు, బావులను ఆశ్రయిస్తుండగా పట్టణంలో స్విమ్మింగ్ పూల్‌కు పరుగులు తీస్తున్నారు.

సందడే సందడి

ఎండలు తీవ్రత పెరగడంతో స్విమ్మింగ్ పూల్‌కు ఆదరణ పెరుగుతోంది. మహిళలకు సైతం వేర్వేరు సమయాల్లో శిక్షణ అందిస్తున్నారు. శరీరంలో అదనంగా పేరుకుపోయిన కొవ్వు కరగడంతో పాటు మధుమేహంతో బాధపడుతున్న వారికి ఈతతో ఉపశమనం కలుగుతుంది. ఒంటి నొప్పులు, కీళ్ల నొప్పులు, అలర్జీ వంటివి దూరమై రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు అదుపులో ఉంటాయి. చురుకుదనం పెరిగి జ్ఞాపకశక్తి మెండుగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఆరోగ్యంతో పాటు శరీరాకృతిని సైతం మెరుగు పరిచేందుకు స్విమ్మింగ్ దోహదపడుతుందని వైద్యం నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి...

- ఈత కొట్టే ముందు కొంతసేపు జాగింగ్ చేయడం మంచిది.
- శిక్షణకు వచ్చే వారిపై సిబ్బంది వ్యక్తిగతంగా ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి.
- స్విమ్మింగ్ డ్రెస్, క్యాప్, గ్లాసెస్, ట్యూబ్‌లను తప్పనిసరిగా వినియోగించాలి. లేక పోతే కళ్లకు, జుట్టుకు ఇన్ఫెక్షన్ వచ్చే ఆస్కారం ఉంది.
- చెవిలోకి నీరు వెళితే ఫంగస్ ఏర్పడుతుంది. ఇయర్ ప్లగ్స్ వాడటం మంచిది.
- కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ పొంది తర్వాత నీటిలో ఈదటం, కూర్చోవడం వంటివి మెల్లమెల్లగా ప్రాక్టీస్ చేయాలి.
- కొలనులో నీరు తరచుగా మారుస్తుండాలి. స్వచ్ఛమైన నీటిలో మాత్రమే స్విమ్మింగ్ చేయాలి.
- నీటిలో ఎలాంటి బ్యాక్టీరియా లేకుండా చర్యలు తీసుకోవాలి.
- చర్మ, అంటు వ్యాధులు ఉన్నవారిని వీలైనంత వరకు స్విమ్మింగ్ చేసేందుకు అనుమతించకూడదు.
- కెమికల్స్ తరచూ మారుస్తూ ఉండాలి. నీటిలో బ్లీచింగ్ పౌడర్ వేస్తుండాలి. అలా అని బ్లీచింగ్‌ను ఎక్కువగా వాడకూడదు.
- పూల్‌తోపాటు చెరువుల్లోనూ ఈత తర్వాత మంచి నీళ్ళతో స్నానం చేయడం మంచిది.

జాగ్రత్తలు తప్పనిసరి....

జాగ్రత్తలు తీసుకోకపోతే చర్మ వ్యాధులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సరైన మోతాదులో కెమికల్స్ లేకపోతే ముప్పు తప్పదని అంటున్నారు. ఈతకు వచ్చేవారి నుంచి తమకు చర్మ వ్యాధులు, ఫిట్స్ లేని వారిని మాత్రమే స్విమ్మింగ్ పూల్ లోపలికి అనుమతించాలి.

క్లుప్తంగా

వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రాజీనామా



గుంటూరు రూరల్: ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఆళ్ళ రవిదేవరాజు తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం ఏటుకూరు గ్రామంలోని తన నివాసం నుంచి రాజీనామా పత్రాన్ని అధికారులకు మెయిల్ ద్వారా అందజేశారు. పదవీ కాలం ఇంకా ఏడాదికిపైగా ఉండగానే తన పదవికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో తన పదవిని వదులుకున్నట్లు చెప్పారు.

వ్యవసాయ సలహా మండలికి బొద్దులూరి రాజీనామా



పొన్నూరు : గుంటూరు జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ పదవికి పొన్నూరుకు చెందిన బొద్దులూరి రంగారావు రాజీనామా చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలవల ఛానల్, శ్రీ రంగ పురం ఛానల్, ఆరెమండ ఛానల్‌ను తన పదవీకాలంలో అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. రైతులకు సేవ చేసేందుకు అవకాశం కల్పించిన గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

నేటి నుంచి పెదకాకాని రైల్వేగేటు మూసివేత



పెదకాకాని: పెదకాకాని గ్రామం నుంచి వెనిగండ్ల వెళ్లే రోడ్డులోని రైల్వే గేటును సోమవారం నుంచి 13వ తేదీ వరకు మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గేటు మరమ్మతులతోపాటు గేటుకు ఇరువైపులా ఉన్న రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ ప్రాంతంలో రాకపోకలు నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వాహనదారులు, గ్రామప్రజలు సహకరించాలని కోరారు.

చర్చి వద్ద పోలీసు బందోబస్తు



పెదకాకాని: చర్చి పాస్టర్ బదిలీ వ్యవహారంపై చోటు చేసుకున్న వివాదం కారణంగా పెదకాకాని లూథర్‌గిరి ఏఈఎల్‌సీ చర్చి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బదిలీ వ్యవహారంపై కొంతకాలంగా చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో చర్చి అధికారుల ఆదేశాల మేరకు నూతన పాస్టర్‌ను నియమించారు. బదిలీ వివాదంతో ఆదివారం చర్చిలో ప్రార్థనకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ కే వీరాస్వామి తెలిపారు.

మోదీతోనే దేశాభివృద్ధి



తాడేపల్లి రూరల్ : ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారతదేశం ముందుకు వెళుతుందని భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షులు అంజిరెడ్డి అన్నారు. ప్రధానిగా మూడో సారి నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని రామచంద్రాపురంలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం ప్రపంచంలో అత్యుత్తమంగా వెలుగొందుతోందని అన్నారు. రాజ్యాంగ బద్ధంగా పరిపాలన సాగిస్తున్న మోదీకి ప్రజలు పట్టం కట్టారని అన్నారు. మోడీ ప్రజాస్వామిక పరిపాలన గర్వించదగిన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై దాడి

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాకలో నగదు విషయమై వృద్ధుడిపై ఓ వ్యక్తి ఆదివారం దాడికి పాల్పడ్డాడు. సేకరించిన వివరాల ప్రకారం.. పెనుమాకకు చెందిన బండి శివారెడ్డి అనే వృద్ధుడు తన కుమారుడితో కలసి పురుగుల మందు షాపు నిర్వహిస్తున్నారు. అదే గ్రామానికి డేగల శంకరరావు 2015లో రూ.50 వేల మందులు కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి డబ్బులు ఇవ్వడం లేదు. మధ్యలో రూ.పది వేలు జమ చేశాడని, మిగతా నగదు గురించి నిలదీయడంతో డేగల శంకరరావు కొడవలితో దాడి చేయడంతో శివారెడ్డి ఛాతీపై, ఎడమ చేతిపై స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, యస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొంతమంది రాజీ చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

వైభవంగా పందిర్ల పండగ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో ఆదివారం సాయంత్రం పందిర్ల పండుగను వైభవంగా నిర్వహించారు. ఆలయం చుట్టూ సుందరంగా మూడు పందిర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక దివ్యపూజాబలి కార్యక్రమంలో బాల ఏసుదేవాలయ విచారణ గురువులు ఎం. ఫాతిమా మర్రెడ్డి వాక్యోపదేశం చేశారు. మన్నారు(దివ్యసత్ ప్రసాదం) దేవుడి యొక్క ఉనికిని తెలియజేస్తుందని చెప్పారు. మన్నాను తీసుకువెళితే విజయం చేకూరుతుందని ఇశ్రాయేల్ ప్రజలు భావించేవారన్నారు. ఏసుక్రీస్తు ప్రజల పాపాలను ప్రక్షాళన చేశారని చెప్పారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. దివ్యసత్ ప్రసాదాన్ని భక్తులకు చూపి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఫాదర్ విలియమ్స్, మఠకన్యలు, గుడిపెద్దలు, మరియదళ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సహాయం



తాడేపల్లి రూరల్ : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెం గ్రామంలో ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ స్టీల్ ప్లాంట్ జనరల్ మేనేజర్ కె. నాగేశ్వరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిన బుల్లా అర్జున్ తేజ్ (543 మార్కులు), లాం షైనీ మధురిమ (530)లకు రూ.7 వేల చొప్పున విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయ సమాఖ్య బృందం ఆధ్వర్యంలో సహాయం అందించామని పేర్కొన్నారు. మరో 15 మంది విద్యార్థులకు రూ.6 వేల వంతున అందజేశామని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి విద్యార్థులు మరిన్ని శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. పులి రవి, డాక్టర్ ఎల్. రత్నకుమారి, బి. సంజయ్ కుమార్ (కెనడా), కె. రాజశేఖర్, కె. నవ్య (కెనడా), ఎల్. రవికుమార్, పి. లాజరు, బి. మరియదాసు, బి. సురేష్‌బాబు, బి. వెంకటేష్, ఎస్. కిషోర్, కె. ప్రవీణ్, కె. ఇమ్మానుయేల్ తదితర దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

ఉజ్వల భవిష్యత్తుకు ఉన్నత విద్య ముఖ్యం


ప్రసంగిస్తున్న ఈవీ నారాయణరావు

తాడేపల్లి రూరల్ : ఉన్నత విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, గౌడ జన సేవా సమితి ఫౌండర్, ఛైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ రావు అన్నారు. ఆదివారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి గౌడ కల్యాణ మండపంలో ఎడ్యుకేషన్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ ఫర్ గౌడ్స్ (ఈసీజీ) ఆధ్వర్యంలో ఉన్నత విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈవీ నారాయణ రావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు పిల్లలు ఉన్నత చదువులతో ఎదగాలని పేర్కొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేలా స్ఫూర్తి గ్లోబల్ ఆర్గనైజేషన్, అమెరికా – ఈసీజీ సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ యం. శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ణయించుకుని సాధించడానికి క్రమశిక్షణతో కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక సత్యనారాయణ, ఏపీ ట్రెజరీస్, అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ మేక శేషగిరిరావు, , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హిందూ సేవా సమితి అన్నదానం


అన్నదానం చేస్తున్న సమితి సభ్యులు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని మహాకాళేశ్వర స్వామి ఆలయం వద్ద ముప్పాళ్ల మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన జైహనుమాన్ హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సేవాసమితి ఆధ్వర్యంలో నెలలో ఒకరోజు గ్రామాల్లోని ఆలయాల వద్ద అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఏడాది కాలంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, స్నేహితులమైన తాము తమ సంపాదనలో కొంత సేకరించి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సమితి సభ్యులు ఎస్. స్వామి, వై.శివ, టి. నరసింహారావు, ఆర్.రామయ్య, ఎస్. నారాయణ, పి. వెంకటరత్నం, బి.సాయి, ఎస్. విజయకుమార్, రామాంజి, వీరాంజి, టి. బ్రహ్మయ్య, ఎ.సాంబ తదితరులు పాల్గొన్నారు.